క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా మహిళా రైతులు పనిముట్లు, పరికరాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం రాయితీపై మహిళారైతులకు పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. మహిళల పేరు మీద భూమి ఉండాలని, ట్రాక్టర్ ఆర్సీ మహిళ పేరుమీద కాని లేదా వారి భర్త పేరుమీద కాని ఉండాలని తెలిపారు. అలాగే పవర్ స్ప్రేయర్లు, రోటోవేటర్స్, పవర్‌వీడర్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు

వర్గల్(గజ్వేల్): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పూలే బాలికల గురుకులంలో గురువారం ముందుజాగ్రత్తగా వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సమక్షంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు దీప్తి, హెచ్ఈఓ ఉమారాణి, సిబ్బంది శ్రీనివాస్, పూజిత, ప్రభాకర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జ్వరం, చర్మవ్యాధులకు గురైన వారికి మందులు అందజేశారు. తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మల్లన్న ఆలయంలో వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో తలనీలాలు, ఎలమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయ హక్కు కోసం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ వేలంలో తల నీలాలకు సంబంధించి రుద్ర ఎంటర్ ప్రైజెస్ రూ.1,01,01,116 అధిక పాటపాడి హక్కులు దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే రూ. 38,64,116లు అధికంగా రావడంతో ఈఓ, ఆలయ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి హర్షం వక్తం చేశారు. కొబ్బరికాయల విక్రయం కోసం టెండర్ దారులు రాకపోవడంతో దానిని వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఈత చెట్లు నాటండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



ఈత మొక్క నాటుతున్న కమిషనర్

హుస్నాబాద్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఈత మొక్కలు నాటారు. గౌడ కులస్తులు విరివిరిగా ఈత చెట్లు పెంచాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో ఈత మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, వరప్రసాద్, శ్రీకాంత్, రవి, కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలుకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ములుగు మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారికి గురువారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని, ఫించన్ పెంపునకు ఇప్పటి వరకు ఆమోదం లభించలేదన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా రూ.2,500 ఇంకా అమలు కాలేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు భాగ్యలక్ష్మి, రమేశ్‌యాదవ్, ఆనంద్, హరికృష్ణ, శ్రీకాంత్, కృష్ణయాదవ్, జగన్, ప్రవీణ్‌గౌడ్, ఆర్విన్, స్వామి, దినేశ్ యాదవ్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం



కొమురవెల్లి(సిద్దిపేట): గురువన్నపేటలోని కాముని చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ దివ్య



సిద్దిపేటఅర్బన్: మత్తడి పోస్తున్న ఎన్సాన్‌పల్లి చెరువు



తొగుట(దుబ్బాక): చందాపూర్ పెద్ద చెరువు వరద వెంకట్రావుపేట రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



మద్దూరు(హుస్నాబాద్): పొంగి ప్రవహిస్తున్న ధూళ్మిట్ట వాగు



చేర్యాల(సిద్దిపేట): గుర్జకుంటలో దెబ్బతిన్న ఇల్లు



వర్గల్(గజ్వేల్): దండుపల్లిలో పాక్షికంగా కూలిన ఇల్లు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లావ్యాప్తంగా చెరువులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెక్ డ్యామ్‌లు మత్తడి దూకుతున్నాయి. వరద నీటి ప్రవాహంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల కట్టలు తెగి గ్రామాల్లోకి నీరు చేరింది. మరి కొన్ని చోట్ల విద్యుద్ స్తంభాలు నేలకూలాయి. ఇతర గ్రామాలు, పట్టణాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు.



సిద్దిపేటఅర్బన్: తిప్పరబోయిన కాలనీకి వెళ్లే రోడ్డుపై నుంచి మత్తడి దూకుతున్న వరద



చేర్యాల(సిద్దిపేట): కడవేర్గు పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు



కొండపాక(గజ్వేల్): ఉధృతంగా ప్రవహిస్తున్న కొండపాక బతుకమ్మ చెరువు



గజ్వేల్/గజ్వేల్‌రూరల్: సింగాటం డబుల్‌బెడ్రూమ్ కాలనీవాసులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

భారీ వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం దొమ్మాట గ్రామాన్ని పర్యటించారు. చెరువు, రోడ్లను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల పరిధిలోని లో లెవెల్ బ్రిడ్జిలు నిర్మించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ధ్వంసమైన గాజులపల్లి నుంచి అక్బర్‌పేట్- భూంపల్లి మండలానికి వెళ్ళే రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మార్వో చంద్రశేఖర్‌రావు, ఇరిగేషన్ ఏఈ సుమన్, నాయకులు పూజిత, మోహన్‌రావ్, రహీమొద్దీన్ ఉన్నారు.



దౌల్తాబాద్(దుబ్బాక): దొమ్మాటలో ధ్వంసమైన రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



గజ్వేల్/గజ్వేల్‌రూరల్: రిమ్మనగూడలో కూలిన ఇల్లు



సిద్దిపేట: కోమటిచెరువు నిండి ప్రవహిస్తున్న మత్తడి



సిద్దిపేట: డివైడర్‌పై నడిచి వెళ్తున్న పట్టణవాసులు



చెరువును తలపిస్తున్న సిద్దిపేట ప్రధాన రహదారి

సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయండి

- కలెక్టర్ హైమావతి
- జిల్లా ఆస్పత్రిలో తనిఖీ

గజ్వేల్: సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయడానికి వైద్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ హైమావతి సూచించారు. గురువారం రాత్రి ఆమె గజ్వేల్ ప్రభుత్వ ఆస్పతిని సందర్శించారు. ఔట్ పేషెంట్ రిజిస్టర్, ల్యాబ్, జ్వర బాధితుల చికిత్స గది, మందుల స్థాక్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నందువల్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చేవారికి వెంటనే డెంగీ నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలని చెప్పారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని సందర్శించారు. సహజ ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంజిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంజిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. నంగునూరులో గురువారం ముఖ్య కార్యకర్తలను కలిసి గణపతి మండపాలను సందర్శించారు. ఎమ్మెల్సీగా గెలుపొంది మొదటిసారిగా మండలానికి వచ్చిన అంజిరెడ్డిని బీజేపీ నాయకులు సన్మానించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఖానాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సతీశ్, కిషన్, యాదయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

– ఎస్ఐ కృష్ణారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రజలు సీసనల్ వ్యాధులు, వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

గ్రామంలో డెంగీ లక్షణాలతో ఇద్దరు మృతి చెందిన విషయం తెల్సిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు 25 నుంచి వైద్య శిబిరం కొనసాగుతుంది. వైద్యులు కిరణ్, భాస్కర్ సిబ్బంది కలిసి జ్వరాల బారిన పడిన వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. తీవ్ర జ్వరాలతో బాధపడేవారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిమ్మాపూర్‌లో రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారాయి.

పోలీసులంటే భయం వద్దు

- త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: విద్యార్థినులు, మహిళలు పోలీసులంటే భయం వీడాలని, సమస్యలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి మిట్టపల్లి గురుకుల కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ప్రాముఖ్యత, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్‌పై విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియా, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుళ్లు మమత, రజని, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

చర్చకు రాని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

మద్దూరు(హుస్నాబాద్): యూరియా అవినీతిపై చర్చకు వస్తాని సవాల్ విసిరిన చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి కానరాకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి ఎద్దేవా చేశారు. సవాల్‌లో భాగంగా చర్చలో పాల్గొనడానికి మద్దూరు పీఏసీఎస్ క్యాష్ కౌంటర్ వద్ద గురువారం ఇతర నాయకులతో కలిసి తరలివచ్చారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రేబర్తి పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో 25న పంపిణీ చేసిన యూరియా బస్తాలలో 15 బస్తాలను జీవన్‌రెడ్డి, మరో రైతు పేరుతో 15 బస్తాలు తీసుకెళ్లారన్నారు.

ముదిరాజ్ పోరాట సమితి అధ్యక్షుడిగా సంపత్



హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి మండల అధ్యక్షుడిగా పోలు సంపత్‌ను రాష్ట్ర కమిటీ నియమించినట్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ నిత్యం ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం పోరాడుతానన్నారు. తనపై నమ్మకంతో ఎంపిక చేసిన నాయకులకు కృజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.



మిరుదొడ్డిలో బొజ్జ గణపయ్యకు పూజలు



చేర్యాల(సిద్దిపేట): ఏడో వార్డులో..




బెజ్జంకిలో..

జైజై.. గణేశ..

వినాయక చవితి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మండపాలలో వినాయక విగ్రహాలు కొలువుతీరాయి. బుధవారం ప్రత్యేక వాహనాల్లో యువత వినాయకులను డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నెలకొల్పారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు గణనాథుడికి తీరొక్క పూజలు చేయనున్నారు.



హుస్నాబాద్ శివాజీనగర్ హనుమాన్ ఆలయంలో గణేశుడికి పూజలు చేస్తున్న రజిత తదితరులు



దుబ్బాకటౌన్: దుబ్బాకలో..



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో..



నంగునూరులో..



చిన్నకోడూరులో..



జగదేవ్‌పూర్(గజ్వేల్): వట్టిపల్లిలో..

అమరుల స్ఫూర్తితో పోరాటాలు

చేర్యాల(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్: అమరుల స్ఫూర్తితో నేటి యువత పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. చేర్యాల కార్యాలయంలోను, సిద్దిపేట కార్మిక, కర్షక భవన్‌లోను జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ నాటి తెలుగుదేశం ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విద్యుత్ విధానాన్ని అడ్డుకునేందుకు సుమారు 100 రోజులపాటు సాగిన ఉద్యమంలో ఆ ముగ్గరు అమరులయ్యారన్నారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు నాగరాజు, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం ఇబ్రహీం, శశిధర్, రవికుమార్, శిరీష, రవీందర్ రెడ్డి, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/మర్కూక్(గజ్వేల్): భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉన్నదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే దెబ్బతిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రాజమౌళి, నవాజ్‌మీరా, మధు, దేవీ రవీందర్, మల్లేశం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మర్కూక్ మండలంలోని ఎర్రవల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ తుమ్మ కృష్ణ తల్లి తుమ్మ ఆగవ్వ రెండు రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్, కనకయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.